## క్లుప్తంగా

### రాయితీ గడువు పొడిగింపు

ఆర్మూర్‌టౌన్‌: 2025–26 ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా చెల్లించే ఆస్తి పన్నుపై 5శాతం రాయితీపై గడువును ఈనెల 7 వరకు పొడిగించినట్లు మున్సిపల్‌ కమిషనర్‌ రాజు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆస్తి పన్ను బకాయి ఉన్న యజమానులు తమ ఆస్తి పన్నులు చెల్లించుకోవాలన్నారు. అలాగే గతంలో 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌ కింద దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు ప్రభుత్వం కల్పిస్తున్న 25 శాతం రాయితీని ఈ నెల 3 వరకు పొడిగించినట్లు తెలిపారు.

### 385 పశువులకు టీకాలు



మాక్లూర్‌: వల్లభాపూర్‌లో గురువారం మండల పశువైద్యాధికారి కిరణ్‌కుమార్‌ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది 385 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వేసవికాలంలో పశువులకు సోకే గాలికుంటు వ్యాధిని దృష్టిలో పెట్టుకుని మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోను ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించి టీకాలు వేస్తున్నట్లు ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌ దేశ్‌పాండే తెలిపారు. టి.వినిత, ఆర్‌ కల్యాణి, అహ్మద్‌పాష, శ్యామల, గంగాధర్‌, పుష్ప, సికింధర్‌, సుధీర్‌, బేగ్‌, రైతులు కుర్మ బీరయ్య, పాల్గొన్నారు.

### నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మారంపల్లి హనుమాన్‌ ఆలయం వద్ద ఈ నెల 2 నుంచి 5 వరకు శివ, నందీశ్వర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యజ్ఞ హోమాలు, కుంకుమార్చన, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మహోత్సవానికి వేద పండితులు రానున్నారని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

### దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్‌ జూనియర్‌ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌ ఫస్ట్‌ ఇయర్‌ ఎంపీసీ, బైపీసీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ మహ్మద్‌ ముబీన్‌ తెలిపారు. మైనారిటీ విద్యార్థులకు 60 సీట్లు, బీసీ 10, ఎస్సీ 04, ఎస్టీ 04 ఓసీలకు 2 సీట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు కళాశాల పని వేళల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 91543 65020 నంబర్‌కు ఫోన్‌ చేయాలన్నారు.

### వాహనాల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ ఎస్సై రఘుపతి మాట్లాడుతూ.. వాహనదారులు హెల్మెట్‌ తప్పక ధరించాలని, వాహనాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వద్దన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతిఒక్కరు ట్రాఫిక్‌ రూల్స్‌ను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

### వేల్పూర్‌లో సత్తా చాటిన ప్రభుత్వ స్కూళ్లు



576, శ్రీనిధి

వేల్పూర్‌: ఈ ఏడాది ఎస్సెస్సీ ఫలితాలలో వేల్పూర్‌ మండలంలోని ప్రభుత్వ స్కూళ్లు సత్తా చాటాయి. ను మారు 50 మందికి పైగా విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. గతంలో 500లకు పైగా మార్కులు పొందేవారు కొంతమంది విద్యార్థులే ఉండేవారు. ఈసారి మాత్రం ఒక్కో స్కూలు నుంచి పది మందికి పైగా విద్యార్థులు 500 మార్కులు దాటారు. మండలంలోని అంక్సాపూర్‌ హైస్కూలు నుంచి 26 మంది, పడగల్‌ స్కూలు నుంచి 16 మంది 500లకు పైగా మార్కులు సాధించారు. మోతె స్కూల్‌కు చెందిన సొన్నాయిల శ్రీనిధి 576 మార్కులు సాధించింది.

### ఉచిత క్రికెట్‌ శిక్షణ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ జిల్లాలోని క్రీడాకారులకు వేసవికాలం దృష్ట్యా ఉచిత శిక్షణ ఇవ్వడానికి క్రికెట్‌ శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు చంద్రసేన్‌రెడ్డి తెలిపారు. గురువారం జీజీ కళాశాల ఆవరణలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు.

**రేపు అండర్‌–25 క్రికెట్‌ జట్టుకు ఎంపికలు**

హైద్రాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించే రెండు రోజుల టోర్నీకి 25 సంవత్సరాల లోపు, 19 ఏళ్లపైన ఉన్న క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్‌ అ సోసియేషన్‌ అధ్యక్షులు, కార్యదర్శిలు చంద్రసేన్‌రె డ్డి, వెంకట్‌రెడ్డిలు గురువారం ప్రకటనలో తెలిపా రు.ఈ నెల 3న 5 టీమ్‌లను గిరిరాజ్‌ కళాశాల మై దానంలో ఉదయం 9 గంటలకు ఎంపిక చేసి బాగా ఆడిన 15 మంది క్రీడాకారులతో కూడిన జాబితాను ఎంపిక చేసి టోర్నమెంట్‌కు పంపిస్తామన్నారు.

# ఘనంగా మే డే వేడుకలు

ప్రపంచ కార్మికుల దినోత్సవం 'మే డే'ను గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, నేతలు జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ర్యాలీలు నిర్వహించారు. కార్మిక నేతలు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల రక్షణ కోసం పోరాడుతామన్నారు. కేంద్రం ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌ కోడ్‌లు తీసుకొచ్చి అన్యాయం చేస్తోందన్నారు. ఈ లేబర్‌ కోడ్‌ వల్ల కార్మికుల పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోతున్నారని వాపోయారు. – సాక్షి నెట్‌వర్క్‌



ఎడపల్లి మండలం జంలంలో..



బోధన్‌ పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..



భీమ్‌గల్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..



మాక్లూర్‌: మాదాపూర్‌ ఐఎంఎల్‌ డిపోలో



కోటగిరిలో జెండా ఎగురవేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ఆలూర్‌లో..



తాడ్‌బిలోలిలో.. మాస్‌లైన్‌ ప్రతినిధులు



నవీపేటలో జెండావిష్కరణ చేస్తున్న సీఐటీయూ నాయకులు



నందిపేటలో



కమ్మర్‌పల్లిలో ..



ఆర్మూర్‌లోని జిరాయత్‌ నగర్‌లో 1104 యూనియన్‌ ఆధ్వర్యంలో

## పదమూడేళ్లుగా వంద శాతం ఉత్తీర్ణత

- పదో తరగతి పరీక్షల ఫలితాల్లో రికార్డు సృష్టించిన సుంకెట్‌ ఉన్నత పాఠశాల
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

మోర్తాడ్‌: మండలంలోని సుంకెట్‌ ఉన్నత పాఠశాల పది ఫలితాల్లో రికార్డు సృష్టించింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదమూడేళ్లుగా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలగా సుంకెట్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ నిలిచి అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. పదో తరగతి చదివే విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణతో వంద శాతం ఉత్తీర్ణత సాధ్యమైందంటున్నారు ఉపాధ్యాయ బృందం. 2012–13 విద్యా సంవత్సరం నుంచి మొదలైన ఈ విజయపరంపర నిర్విరామంగా కొనసాగుతూనే ఉండటం విశేషం. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 12 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా ఇందులో 11 మందికి 500లకు మించి మార్కులు లభించాయి. ఒక్క విద్యార్థికి 500ల లోపు మార్కులు వచ్చినా ఉత్తీర్ణత చెందడం గమనార్హం. బండి అనూశ్రీ అనే విద్యార్థినికి 561 మార్కులు లభించగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఆమె టాపర్‌గా నిలిచారు. మరో విద్యార్థిని అంకం శ్రీహిత 556 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. ప్రధానోపాధ్యాయుడు పెద్ది సంతోష్‌ కుమార్‌, ఉపాధ్యాయుల బృందం ప్రతి రోజు సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించి విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని తీర్చి పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దారు.

**అందరి కృషితో మంచి ఫలితాలు**

గ్రామస్తుల సహకారం, ఉపాధ్యాయుల కృషితో మా విద్యార్థులు చక్కగా చదువుకుని పదో తరగతి పబ్లిక్‌ పరీక్షల్లో తమ ప్రతిభను కనబరిచారు. పరీక్షలు అంటే ఎలాంటి బెరుకు లేకుండా ఉత్సాహంగా రాయడంతో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులను సాధించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం.

– పెద్ది సంతోష్‌ కుమార్‌, ప్రధానోపాధ్యాయుడు

### ముగిసిన శివనామ సప్తాహం



బోధన్‌: సాలూర మండల కేంద్రంలో వీరశైవ లింగాయత్‌ సమాజ్‌ నూతన కల్యాణ మండపంలో నిర్వహించిన 6వ అఖండ శివనామ సప్తాహం గురువారం ముగిసింది. ఈ నెల 24 నుంచి ఏడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు జరిగాయి. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన పలువురు వీరశైవ మఠాధిపతులు, ఆరాధ్య గురువులు సప్తాహం శిబిరానికి విచ్చేసి ప్రవచనాలు చేశారు. ముగింపు కార్యక్రమంలో పలువురిని సన్మానించారు. వీరశైవ లింగాయత్‌ సమాజ్‌ గ్రామ కమిటీ ప్రతినిధులు, సభ్యులు, సప్తాహం నిర్వాహకులు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



రుద్రూర్‌: వర్ని మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్‌ హాల్‌లో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను గురువారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. రుద్రూర్‌, వర్ని, చందూర్‌ పొతంగల్‌ మండలాలకు చెందిన 147 మంది లబ్ధిదారులకు రూ.కోటి 47లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. వర్ని, కోటగిరి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌లు సురేష్‌ బాబా, గైక్వాడ్‌ హన్మంతు, తహసీల్దార్‌లు తారాబాయి, సాయిలు, మాజీ జెడ్పీటీసీ నరోజి గంగారాం, అంబర్‌సింగ్‌, తదితరులు పాల్గొన్నారు.

### కమ్మర్‌పల్లి విద్యార్థి ప్రతిభ



వర్షిత్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని విజ్ఞాన జ్యోతి హైస్కూల్‌కు చెందిన నందగిరి వర్షిత్‌ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 589 మార్కులు సాధించి కమ్మర్‌పల్లి మండల టాపర్‌గా నిలిచాడు. చౌట్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సబా సాదియా 572 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో, విజ్ఞాన జ్యోతి హైస్కూల్‌కు చెందిన పటేరి శ్రీనిధి 571 మార్కులు, చౌట్‌పల్లి పాఠశాలకు చెందిన సీహెచ్‌ శ్రీవల్లి 571 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. నందగిరి వర్షిత్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

### పది టాపర్లకు సన్మానం



రాంపూర్‌లో మోడల్‌ స్కూల్‌ టాపర్‌ హరికృష్ణను అభినందిస్తున్న స్థానికులు

రుద్రూర్‌: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించి టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను స్థానిక నాయకులు సన్మానించి అభినందించారు. మోడల్‌ స్కూల్‌ టాపర్‌గా నిలిచిన గోపు హరికృష్ణ(568)ను స్వగ్రామమైన కోటగిరి మండలం రాంపూర్‌లో స్థానికులు ఘనంగా సన్మానించారు. కేక్‌ కట్‌ చేసి తినిపించారు. రుద్రూర్‌ మండల టాపర్‌గా నిలిచిన కేజీబీవీ విద్యార్థిని శివాని(577)కి , బాలికల హైస్కూల్‌ టాపర్‌ గౌతమిని స్వచ్ఛంధ సంస్థ రైడ్స్‌ ఆధ్వర్యంలో సన్మానించారు.

### ‘ఇందిరమ్మ’ పనులు ప్రారంభించాలి

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): అర్హులుగా గుర్తించిన లబ్ధిదారులు త్వరగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎంపీడీవో బ్రహ్మానందం సూచించారు. గురువారం మారంపల్లిలో సర్వే నిర్వహించి లబ్ధిదారులతో మాట్లాడారు. బేస్‌మెంట్‌ లెవల్‌ వరకు నిర్మిస్తే ప్రభు త్వం తొలి విడతగా రూ.లక్ష మంజూరు చేస్తుందని తెలిపారు. నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక, ఇటుక, సిమెంట్‌, కంకర తక్కువ ధరకు లభించేలా చూస్తామన్నారు. ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శి రంజిత్‌ ఉన్నారు.

## స్కూల్‌కు వెళ్లకుండా 501 మార్కులు..

- కుటుంబ సమస్యల కారణంగా పది తరగతులకు రెండు నెలల నుంచి గైర్హాజరు
- మాజీ ప్రజాప్రతినిధులు చొరవ చూపడంతో పరీక్షలకు హాజరైన విద్యార్థిని



సాయి కీర్తన, హాసాకొత్తూర్‌

మోర్తాడ్‌(బాల్కొండ): కుటుంబ సమస్యల కారణంగా తరగతులకు రెండు నెలల నుంచి గైరాజరవుతున్న కొత్తూర్‌ ఉన్నత పాఠశాలకు చెందిన సాయి కీర్తన అనే విద్యార్థిని పదో తరగతి పబ్లిక్‌ పరీక్షలకు కూడా హాజరుకాని పరిస్థితి ఏర్పడింది. బాగా చదివే విద్యార్థిని పరీక్షలకు హాజరు కాకపోతే ఆమె కెరీర్‌ పాడవుతుందని భావించిన ఉపాధ్యాయులు గ్రామ మాజీ ప్రజాప్రతినిధులకు ఈ విషయం వెల్లడించారు. వారు పట్టుబట్టి పరీక్షలను రాయించడంతో ఆ విద్యార్థి ని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. పది ఫలితాల్లో ఆమెకు 501 మార్కులు వచ్చా యి. రెండు నెలల పాటు తరగతులకు హాజరు కాకపోయినా పరీక్షల్లో మాత్రం ప్రతిభ కనబరిచి ప్రథమ శ్రేణి మార్కులతో పాసై అందరి మన్ననలను పొందుతుంది. పరీక్ష రాయడానికి కృషి చేసిన మాజీ ప్రజాప్రతినిధులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

### పేకాట స్థావరంపై దాడి

నందిపేట్‌ (ఆర్మూర్‌): నందిపేట మండలం బాద్గుణ గ్రామంలోని గురడికాపు కళ్యాణ మండపంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నందిపేట ఎస్సై చిరంజీవి, సిబ్బంది దాడి చేసి పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,12,520 నగదు స్వాధీనం చేసుకొని 10 సెల్‌ ఫోన్లను, రెండు కార్లు, రెండు బైకులను సీజ్‌ చేశారు.

### పొతంగల్‌లో ఖాళీ బిందెలతో నిరసన



రుద్రూర్‌: పొతంగల్‌ మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన చేశారు. ఖాళీ బిందెలతో మండల పరిషత్‌ కార్యాలయం వద్దకు తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. తాగు నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ పంచాయతీలో సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. ఎంపీడీవో చందర్‌ ఆందోళన చేస్తున్న వారి వద్దకు వచ్చి సమస్య తెలుసుకున్నారు. నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అమ్మ సహకారం.. గురువుల ప్రోత్సాహం

- పదో తరగతి ఫలితాల్లో మెరిసిన డొంకేశ్వర్‌ విద్యార్థిని తోట రక్షిత
- జిల్లా ప్రభుత్వ పాఠశాల్లో నెంబర్‌ వన్‌ ర్యాంకు



జిల్లా టాపర్‌గా నిలిచిన రక్షితను సన్మానిస్తున్న డీఈవో అశోక్‌.. పక్కన తల్లి సవిత

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): అమ్మ సహకారం, గురువుల ప్రోత్సాహంతోనే తాను పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించానని విద్యార్థిని తోట రక్షిత పేర్కొంది. డొంకేశ్వర్‌ మండల కేంద్రానికి చెందిన రక్షిత స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో చదువుకోగా 586 మార్కులతో జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో నెంబర్‌ వన్‌ ర్యాంకర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని రక్షితను 'సాక్షి' పలుకరించగా పలు విషయాలను పంచుకుంది. వాటిని ఆమె మాటల్లోనే విందాం... మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న దూరంగా ఉండడంతో అమ్మే అన్నీ తానై చూసుకుంది. బీడీలు చుడుతూ నన్ను చదివిస్తోంది. డొంకేశ్వర్‌ జెడ్పీ హైస్కూల్‌లో మంచి విద్యను అందిస్తున్నారని తెలుసుకుని అందులో చేరాను. ప్రయివేటు కంటే బాగా చదువు చెప్పారు. పాఠశాల నుంచి రాగానే ఈ రోజు ఎలా గడిచింది, ఏం పాఠాలు చెప్పారో అమ్మ తెలుసుకునేది. గురువులు కూడా ప్రతిభను గుర్తించి ఎంతో ప్రోత్సాహం అందించారు. అందుకే పదో తరగతిలో పరీక్షలు బాగా రాశాను. ప్రభుత్వ పాఠశాలల్లో నాకు జిల్లా మొదటి ర్యాంకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. జిల్లా విద్యాశాఖ అధికారి నన్ను సన్మానించి అభినందించడం జీవితంలో మరిచిపోలేని విషయం. గణితం అంటే చాలా ఇష్టం. తెలుగులో వందకు వంద మార్కులు వచ్చాయి. ప్రస్తుతం పాలిటెక్నిక్‌కు ప్రిపేర్‌ అవుతున్నా. ఇంటర్‌ చదివితే ఎంపీసీ తీసుకుంటా. బాగా చదివి భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ కావాలన్నదే నా లక్ష్యం.

### ఐదేళ్లుగా నూరు శాతం ఉత్తీర్ణత

- ముప్కాల్‌ కేజీబీవీ పాఠశాల విద్యార్థుల సత్తా
- ప్రారంభం నుంచి నూరు శాతం ఉత్తీర్ణత



ఉపాధ్యాయులతో పదవ తరగతి విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేజీబీవీ విద్యార్థులు ఐదు సంవత్సరాలుగా పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. గత విద్యా సంవత్సరం 41 మంది విద్యార్థులు పరీక్షలు రాసి అందరూ ఉతీర్ణత సాధించారు. పాఠశాలకు సొంత భవనం లేకున్నా అద్దె భవనంలో అనేక కష్టాలను ఎదుర్కొంటూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. ఈ పాఠశాలలో 2020లో పదవ తరగతి ప్రారంభమైంది. ముప్కాల్‌ మండల కేంద్రం ఏర్పడిన తరువాత 2018లో ఇక్కడ పాఠశాలను ప్రారంభించారు. పాఠశాల విద్యార్థి రష్మిత 572 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. 500 కంటే ఎక్కువ మార్కులు 32 మంది విద్యార్థులు సాధించారు.

**సమష్టి కృషితో సాధ్యం**

పాఠశాలలో సమిష్టి కృషితోనే పదవ తరగతిలో గత ఐదేళ్లుగా నూరు శాతం ఉతీర్ణత సాధిస్తున్నాం. ఉపాధ్యాయులు అందరు సమయపాలనతో పాటు క్రమం తప్పకుండా తరగతుల నిర్వహణ చేపడుతున్నారు. ప్రత్యేక తరగతులు పాఠశాల ప్రారంభం నుంచి నిర్వహిస్తున్నాం.

– వినోద, ఎస్‌వో, కేజీబీవీ, ముప్కాల్‌

## మార్కులే ప్రతిభకు కొలమానం కాదు

- బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌



విద్యార్థులను అభినందిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌, ప్రిన్సిపల్‌ కృష్ణమోహన్‌, మేనేజర్‌ చక్రవర్తి

బోధన్‌: మార్కులే విద్యార్థుల ప్రతిభకు కొలమానం కాదని బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌ అన్నారు. మార్కులు తగ్గినంత మాత్రాన నిరాశ పడాల్సిన అవసరం లేదన్నారు. బుధవారం వెలువడిన పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చాటిన పట్టణ కేంద్రంలోని వి జయ సాయి హైస్కూల్‌ విద్యార్థులను ఏసీపీ అభినందించారు. గురువారం పాఠశాల ఆవరణలో సదరు పలువురు విద్యార్థులను శాలువా, పూలబోకే అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ప్రిన్సిపల్‌ కృష్ణ మోహన్‌, పాఠశాల మేనేజర్‌ చక్రవర్తి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి





మాట్లాడుతున్న తెలంగాణ క్రిస్టియన్‌ మైనారిటీ కార్పొరేషన్‌ చైర్మన్‌ దీపక్‌జాన్‌

వేల్పూర్‌: క్రైస్తవులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఉపయోగించుకోవాలని తెలంగాణ క్రిస్టియన్‌ మైనారిటీ కార్పొరేషన్‌ చైర్మన్‌ దీపక్‌జాన్‌ పేర్కొన్నారు. గురువారం ఆయన జాన్కంపేట్‌లోని ఇండిపెండెంట్‌ బాప్టిస్టు చర్చి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. సమాజంలో అన్ని వర్గాల వారికి కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి ఉపాధి పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. క్రిస్టియన్‌ మైనారిటీ విద్యార్థులు సివిల్స్‌, గ్రూప్స్‌, బ్యాంకింగ్‌, ఆర్‌ఆర్‌బి వంటి ఉద్యోగాలు సాధించేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తోందన్నారు. సివిల్స్‌లో రెండవ బ్యాచ్‌ కోచింగ్‌ ప్రారంభమైందని, కోచింగ్‌ తీసుకునేవారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. చర్చి వార్షికోత్సవంలో భాగంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. రెవరెండ్‌ సాల్మన్‌ దైవసందేశం వినిపించారు.

### ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



బోధన్‌: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో సాలూర మండలంలోని హున్సా గ్రామస్తులు కలిశారు. తమ గ్రామంలో నూతనంగా నిర్మించిన బుద్ధ విహార్‌(భవనం) ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ ఆహ్వానించారు. ఈ నెల 12న ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు జక్క సంజీవ్‌ పటేల్‌, భలేరావు గౌతం, బస్వంత్‌, శ్రీకాంత్‌, రావణ్‌, లాలయ్య పాల్గొన్నారు.

### సినిమాలు

పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (ఆర్మూర్‌)

| | |
|---|---|
| స్క్రీన్‌-1 | రైడ్‌-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00 |
| స్క్రీన్‌-2 | హిట్‌-12.30, 3.45, 7.00, 10.15 |
| స్క్రీన్‌-3 | రెట్రో-11.30, 2.55, 6.20, 9.45 |
| స్క్రీన్‌-4 | హిట్‌-11.30, 2.45, 6.00, 9.15 |

### మాంసం ధరలు (రూ..)

| | | | |
|---|---|---|---|
| చికెన్‌ | ధరలు (కిలోకు) | డ్రెస్స్‌డ్‌ | 190 |
| | | లైవ్‌ | 160 |
| స్కిన్‌లెస్‌ | 220 | మటన్‌ | 800 |

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్‌ | 97,200 | వెండి(కిలో) | 1,00,000 |
| 22 క్యారెట్స్‌ | 89,725 | | |

– నిజామాబాద్‌ బిజినెస్‌